క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కరీంనగర్‌కు చెందిన ఏనుగుల కొమరయ్య దంపతులు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు కలసి ఈమేరకు విరాళం అందజేశారు. వారికి అధికారులు కృతజ్ఞతలు తెలిపి శ్రీస్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు, ఆశీర్వదించి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు



మందును పిచికారీ చేస్తున్న కార్మికుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు, నెరిణికండ్రిగ, కారణి గ్రామాల్లో గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ పారిశుధ్యం మెరుగు చర్యలు చేపట్టారు. గ్రామం, దళితవాడల్లోని డ్రైనేజీ కాలువల్లోని మురుగును కూలీలతో తొలగించారు. అదే విధంగా వీధుల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు క్లోరినేషన్ చేయించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమలు వృద్ధికాకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మురుగునీటి నిల్వ లేకుండా చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

భవిత కేంద్రం పరిశీలన



భవిత కేంద్రంలో దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని శనివారం మండల విద్యాశాఖాధికారి రవీంద్రనాథ్ పరిశీలించారు. భవిత కేంద్రంలోని దివ్యాంగులకు వివిధ ప్రశ్నలను వేసి, జవాబులను రాబట్టారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో 16 మంది పిల్లలకు ప్రతి నెలా రవాణా ఖర్చులు ఇస్తామని తెలిపారు. గ్రహణమొర్రి ఉన్న పిల్లలకు శస్త్ర చికిత్సలు సర్వశిక్షాఅభియాన్ పథకంలో చేయిస్తారన్నారు. దివ్యాంగులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీఎస్‌లు అయ్యప్ప, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



అడవికొడియంబేడులో కవాతు చేస్తున్న బలగాలు

పిచ్చాటూరు: మండలంలో అత్యంత సమస్యాత్మక ప్రాంతాలైన కారూరు, అడవికొడియంబేడు, ఎస్ఎస్‌బి పేట గ్రామాల్లో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ జితేంద్ర సింగ్ అధ్వర్యంలో ఈ కవాతు సాగింది. డీఎస్పీ మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గానికి 3 కంపెనీల(300 మంది) పారామిలిటరీ బలగాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. మే 13న రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల జరగనున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని మండలాలు, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఇలాంటి కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కవాతులో సీఐ భాస్కర్ నాయక్, పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. సూళ్లూరుపేటకు చెందిన సుకుమారన్(42), శ్రీనివాసులు ద్విచక్ర వాహనంపై తిరుపతికి వెళుతున్నారు. మార్గమధ్యంలో మేర్లపాక వద్ద ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరామశ్రీనివాసులు చెప్పారు.

సంక్షేమ పాలన కొనసాగిద్దాం

- అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి
- ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి



పథకాలను వివరిస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి ప్రజలను కోరారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె తొట్టంబేడు మండలంలోని పూడి, దళితవాడ, అరుంధతివాడ, ఎస్టీకాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన పథకాల లబ్ధి వివరాలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి ఇంటి ముంగిటకే అందుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరి అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయ్యిందన్నారు. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. నాడు–నేడు కింద విద్యాసంస్థలు, ఆస్పత్రులను ఆధునికీకరించారని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 30 సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధి కేవలం ఈ ఐదు సంవత్సరాల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేశారన్నారు. గత పాలకులు గెలిచిన తరువాత హైదరాబాద్‌కు వెళ్లి సొంత వ్యాపారాలు చేసుకునేవారని విమర్శించారు. మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉండేవారని, శ్రీకాళహస్తిలో కార్యాలయం ఏర్పాటు చేసి ప్రజల వినతులపై ఎప్పటికప్పుడు స్పందించి సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కరోనా సమయంలో కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమాన్ని కాంక్షించారని పేర్కొన్నారు. రూ.కోట్లు వెచ్చించి అనేక సహాయ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. ఏ అవసరం వచ్చినా తాను ఉన్నానని ప్రజలకు భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వాసునాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, పీసీఎస్‌సీ చైర్మన్ మణినాయుడు, నాయకులు కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యంనాయుడు, స్థానిక నాయకులు నరసింహనాయుడు, మురళి, నాగరాజు, విజయబాబు, వెంకటసుబ్బయ్య, డానియేల్, హరి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో శ్రీవాణిరెడ్డి

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



శ్రీకాళహస్తి : కేంద్ర బలగాల కవాతులో సీఐ అజయ్‌కుమార్

శ్రీకాళహస్తి : ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మద్దిలేడు, గుంటకిందపల్లి, జింగిళిపాళెం, ఊరందూరు, విశాలాక్షినగర్‌లో శనివారం కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు పోలీసు రక్షణ ఉంటుందని భరోసా ఇచ్చేందుకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు రాజకీయ పార్టీల నాయకులు కోడ్ నిబంధనలపై అవగాహనతో నడుచుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశ భవిష్యత్తును మార్చే ఆయుధం ఓటు

సత్యవేడు: ప్రజాస్వామ్యం వ్యవస్థలో ఓటు హక్కు దేశ భవిష్యత్తును, నీ భవిష్యత్తును మార్చే ఆయుధం లాంటిదని ఏఈఆర్‌ఓ రామాంజనేయులు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో ' నీ ఓటు– నీ భవిష్యత్తు 'కార్యక్రమాన్ని శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి ఆంధ్రా– చెన్నై రోడ్డు చెక్‌పోస్టు వరకు, ఆర్టీసీ బస్టాండునుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఐదేళ్లకోసారి వేసే ఓటు ప్రజల భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రజల చేతిలో వజ్రాయుధమని అన్నారు. విద్యార్థులు గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరచి ఓటు శాతాన్ని పెంచాలన్నారు. పోలింగ్ విధానాన్ని తెలియజేశారు. ఎన్నికల నియమావళి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్, ఎస్ఐ వీరాంజనేయులు, డీటీ రవిచంద్ర, దాస్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడులో విద్యార్థులు, అధికారుల మానవహారం

కారుణ్య నియామకంలో ఉద్యోగమివ్వండి

రేణిగుంట: తన కుమారుడికి కారుణ్య నియామకం కింద రైల్వే ఉద్యోగమిచ్చి ఆదుకోవాలని రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌కు ఓ కుటుంబం వినతి పత్రాన్ని అందించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ తిరుపతి రైల్వే స్టేషన్‌లో తనిఖీల అనంతరం శనివారం తిరుగుప్రయాణం నిమిత్తం రేణిగుంట స్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే ట్రాక్‌మెన్‌గా పని చేస్తూ తన భర్త రాజామణి మృతి చెందాడని, కారుణ్య నియామకం కింద తన కుమారుడు పురుషోత్తంకు ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని సుబ్బమ్మ వినతిపత్రాన్ని అందించారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

కోడ్ అమలుకు సి-విజిల్ యాప్

సత్యవేడు: నియోజకవర్గంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి సి.విజిల్ యాప్‌ను వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు. ఎన్నికల అధికారి శనివారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) ఉల్లంఘనను నిరోధించి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు పౌరులే నిఘా విభాగం పరిశీలకులుగా వ్యవహరించే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించిందని అన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే ప్రజల చేతిలో సీ-విజిల్ యాప్ ఉండాలన్నారు. నియమావళిని ఉల్లంఘిస్తే సి.విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు తెలియజేయవచ్చన్నారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, భయపెట్టినా, బలవంతంగా ప్రభావితం చేసినా సి.విజిల్ యాప్ ద్వారా సమాచారం అందించవచ్చని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి వంద నిమిషాల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎక్కడైనా, సభలు, ర్యాలీలు, ఇతర రాజకీయ పరమైన సమావేశాలు నిర్వహించే వారు రిటర్నింగ్ అధికారి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వాటి అనుమతులకు సువిధ లే ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమాలకు సంబంధించిన పత్రాలను 'సువిధ' యాప్‌లో జతచేసి ఆన్‌లైన్‌లోనే అనుమతులు పొందవచ్చన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల నియమావళికి సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు 08576–297445 టోల్‌ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

వరి రైతుకు సిరి

- గిట్టుబాటు ధరలకు ఢోకాలేదు
- క్వింటాల్ రూ.2500 పైమాటే...
- పొలం వద్దకే వ్యాపారులు..

రబీ సీజన్‌లో వరి సాగు

- 1,88,638 ఎకరాల్లో 18 రకాల వరి సాగు
- అందులో మూడు రకాల పంటలు–1,56,140ఎకరాలు
- ఆర్ఎన్ఆర్–15048–55,732 ఎకరాలు
- బీపీటీలు–5204–64,682 ఎకరాలు
- కేఎన్ఎం–1638–35,725 ఎకరాలు
- ఈ మూడు రకాలే 82శాతం సాగు
- వీటి క్వింటాల్ ధర రూ.2500 పలుకుతోంది.

తిరుపతి అర్బన్: ఈ రబీ సీజన్‌లో వరి పంటకు జిల్లాలో భలే డిమాండ్ ఉంది. ఓ వైపు మంచి దిగుబడి రావడంతోపాటు మరోవైపు గిట్టుబాటు ధరలు బాగా ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి మంచి ధరలకే కొనుగోలు చేస్తున్నారు. వరి పంటలో 30 రకాలకుపైగానే ఏటా రైతులు సాగు చేసేవారు. అయితే అధికారులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మూడు రకాలపై అవగాహన కల్పించారు. దీంతో ప్రధానంగా మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్న ఆర్ఎన్ఆర్–15048, బీపీటీలు–5204, కేఎన్ఎం–1638 రకాలను రైతులు సాగు చేసేలా వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించారు. అధికారుల ప్రోత్సాహంతో 82 శాతం రైతులు ఆ మూడు రకాలకు చెందిన పంటలే సాగు చేశారు. దీంతో ఆ మూడు పంటలకు క్వింటాల్ రూ.2500 పైగా ధర పలుకుతోంది. గత ఏడాది రూ.1800 నుంచి రూ.2000 ఉండేది. ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.500 అధికంగా ధరలున్నాయి. దీంతో పెట్టుబడులు పోను ఎకరం సాగుకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు ఆదాయం వస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





అంజిమేడు గ్రామంలో మంచి దిగుబడిని ఇచ్చిన ఆర్ఎన్ఆర్ వరి పంట

పెట్టుబడులు పోను రూ.2.50 లక్షలు వస్తోంది...



నా పేరు కన్నెప్ప మొదలియార్. మాది ఏర్పేడు మండలంలోని మోదుగులపాళెం గ్రామం. ఆర్ఎన్ఆర్–15048 రకం పంటను 2.5 ఎకరాల్లో సాగు చేశాం. పంట చాలా బాగుంది. మరో వారం పది రోజుల్లో పంట ఒబ్బిళ్లు చేస్తాం. ఎకరానికి పెట్టుబడులు పోను రూ.50 వేలు ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నాం. 2.5 ఎకరాలకు రూ.1.25లక్షలు ఆదాయం రానుంది. అధికారుల ప్రోత్సాహంతో మార్కెట్‌లో డిమాండ్ ఉంటే పంటను సాగుచేశాం. దీనికితోడు గడిచిన ఐదేళ్లలో వర్షాలు బాగా కురవడంతో మంచిగా పంటలు సాగు చేస్తున్నాం. పెట్టుబడులు పోను ఆదాయం వస్తోంది. – కన్నెప్ప, మొదలియార్, మోదుగులపాళెం గ్రామం, ఏర్పేడు మండలం

82 శాతం ఆ మూడు రకాలే...



గతంలో రైతులు జిల్లాలో 30కి పైగా వరి రకాలు సాగు చేస్తుండేవారు. అయితే వాటిలో కొన్ని పంటలకు మార్కెట్‌లో సరైన ధరలు ఉండేవి కాదు. అంతేకాకుండా కొన్ని రకాల పంటలకు తెగుళ్లు ఎక్కువగా వచ్చేవి. దీంతో దిగుబడి తగ్గుతూ వచ్చేది. దీంతో ఈ ఏడాది రబీలో మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాం. ప్రధానంగా ఆర్ఎన్ఆర్–15048, బీపీటీలు–5204, కేఎన్ఎం–1638 పంటలను ప్రోత్సహించాం. 82 శాతం ఆ మూడు వరి రకాలే సాగు చేశారు. దీంతో మంచి దిగుబడితోపాటు గిట్టుబాటు ధర బాగా ఉండడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. వచ్చే ఏడాది 100 శాతం డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసేలా ప్రోత్సహిస్తాం. – ఎస్.ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం



నూకతోటి రాజేష్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటన అనంతరం నూతనోత్సాహం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు, మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల సమన్వయంతో నియోజకవర్గంలో మంత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం విజయవంతమైందని పేర్కొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి పాల్గొన్న ఏడు మండలాల ఎన్నికల ప్రచార శంఖారావం సభలకు పెద్దఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా హాజరై మద్దతు పలకడం పార్టీ శ్రేణుల్లో ఆనందం నింపిందన్నారు. సత్యవేడులో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, సర్వత్రా చర్చ జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారని, వారి ఉత్సాహమే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మళ్లీ ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు నిదర్శనంగా కనిపించిందని తెలిపారు. ఇదే ఉత్సాహంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేస్తామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి పర్యటన విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

రేణిగుంట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమైందని, బడుగు, బలహీన వర్గాల వారికి జగనన్న ఆపద్బాంధవుడని ఎమ్మెల్సీ సభ్యుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. శనివారం మండలంలోని జీపాళెం పంచాయతీ నల్లపాళెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా పేదల ఆర్థిక ఎదుగుదలకు డీబీటీ రూపంలో నేరుగా పేదల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. ప్రధానంగా విద్య, వైద్య రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులు విమర్శకుల ప్రశంసలను సైతం అందుకున్నాయని తెలిపారు. ఎన్ని పార్టీలు ఏకమైనా ఒక్కడే ఎదురు నిలబడి ప్రజాబలంతో 2024లోనూ మరోసారి అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి కానున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంట ప్రజలు తమకు వివిధ పథకాల కింద నేరుగా డబ్బులు ఖాతాల్లో వేశారని, ఆ మొత్తాన్ని వినియోగించుకుని కుటుంబ పరిస్థితులను మార్పు చేసుకుంటున్నట్లు సంతోషంగా చెబుతున్నారని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో సామాన్య ప్రజలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల సంతృప్తస్థాయి వంద శాతం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బత్తెమ్మ, శ్రీనివాసులురెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

భారతీయ విజ్ఞానం వారసత్వ సంపద



సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: భారతీయ విజ్ఞానం వారసత్వ సంపద అని, దీనిని ప్రతి పౌరునికి అందించాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం జాతీయ సంస్కృత వర్సిటీలో వారం రోజులుగా జరిగిన ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఇన్ ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్‌పై అధ్యాపకులు జరిగిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఆధునిక కాలంలో భారతీయ విజ్ఞానాన్ని ఇండియన్ నాలెడ్జ్ సిస్టం ద్వారా యూజీసీ అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. జ్ఞానాన్ని భావి భారత పౌరులకు అందించి దేశ పురోభివృద్ధికి అధ్యాపకులు కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. అనంతరం వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ భారతీయ జ్ఞాన పరంపర మూలాలు సంస్కృతం, వేదాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. ఇందులోని జ్ఞానాన్ని భావిభారతానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ శివరామభట్, కె.సూర్యనారాయణ, పి.వెంకట్రావు, పలు విశ్వవిద్యాలయాల నుంచి శిక్షణకు విచ్చేసిన 125మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

మా పోలింగ్ బూత్ సిద్ధం



బ్రోచర్లను అందజేస్తున్న జేసీఎస్ కన్వీనర్ చిన్నా

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లం గ్రామ పంచాయతీలో శనివారం మండల జేసీఎస్ కన్వీనర్ చిన్నా ఆధ్వర్యంలో 'మేము సిద్ధం...మా బూత్ సిద్ధం'' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బూత్ కమిటీ, పార్టీ శ్రేణులతో కలసి గడపగడపకు వెళ్లి పేద ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో మోసాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని, అందుకు ప్రజలందరూ అండగా నిలిచి ఆశీస్సులు అందించాలని కోరారు. పంచాయతీలోని 54, 55, 56 బూత్‌ల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని, చంద్రబాబు చేసిన మోసాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు గిరిరెడ్డి, శీను రెడ్డి, బూత్ కన్వీనర్లు రమేష్, సుబ్రమణ్యం యాదవ్, చెల్లా బాబులు పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరుని సేవలో సినీ నటుడు సెంథిల్

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లెలోలోని ప్రసిద్ధ పళ్లికొండేశ్వరస్వామివారిని శనివారం తమిళ సినీ నటుడు సెంథిల్ కుటుంబసమేతంగా సేవించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ పాల్గొన్నారు.



సెంథిల్‌ను సత్కరిస్తున్న బాలాజీరెడ్డి

అరణియార్‌లో జింక మృతి



జింక కళేబరం వద్ద అటవీశాఖ అధికారులు

పిచ్చాటూరు : అరణియార్ జలాశయంలో ప్రమాదవశాత్తు పడి ఓ కృష్ణ జింక మృతి చెందింది. ప్రాజెక్టు తూముల వద్ద నీటిలో తేలుతున్న జింక కళేబరాన్ని మత్స్యకారులు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసుల ద్వారా ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ అధికారి చిత్ర, పశువైద్య శాఖ ఏడీ డాక్టర్ ప్రసాద్ సిబ్బందితో జలాశయం వద్దకు చేరుకున్నారు. జింక కళేబరాన్ని వెలికితీసి, పోస్టుమార్టం చేసి, అక్కడే దహనం చేశారు. బీట్ అధికారి చిత్ర మాట్లాడుతూ జింక దప్పిక తీర్చుకోవడానికి వచ్చి కాలు జారి నీటిలో పడిపోయి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మంజుల, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు, ప్రొటెక్షన్ వాచర్ గోపి, రఘు పాల్గొన్నారు.